క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



తాడేపల్లిలో మంత్రికి వినతిపత్రాన్ని ఇస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

కపిలేశ్వరపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు బుధవారం విజయవాడలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బి.ముత్యాలనాయుడిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కపిలేశ్వరపురానికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్, ఏపీ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ నారాయణదాసు ఆధ్వర్యంలో ఆపరేటర్లు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. సంఘం నాయకులు కె.ధనుంజయ, కె.ఆనంద్, ఎస్.అహ్మద్, లావణ్య, రామాంజనేయులుతో కలిసి మంత్రిని కలవగా సమస్యలను సావధానంగా విని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్టు నారాయణదాసు గురువారం తెలిపారు.

పృథ్వీ పరామర్శ

కపిలేశ్వరపురం: వివిధ కారణాలతో బాధల్లో ఉన్న పలు గ్రామాలకు చెందిన వారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ గురువారం పరామర్శించారు. ఇటీవల వృద్ధాప్యం కారణంగా మృతి చెందిన అంగర గ్రామ పెద్ద చేకూరి వీరవెంకట నాగేశ్వరరావు చిత్ర పటం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. అప్పులను కోల్పోయి బాధల్లో ఉన్న మాచరకు చెందిన అడపా సత్యనారాయణను, అంగరకు చెందిన చిక్కాల మూలాస్వామిని, టేకిలో పుట్టా జానికిరామయ్యలను పలకరించారు. ప్రమాదం కారణంగా చేతి గాయంతో బాధపడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ బోణం సత్తిబాబు పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి సూరిబాబు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, వైఎస్సార్ సీపీ నాయకులు వంగా నల్ల శ్రీను, సంకాబత్తుల చిన్నా ఉన్నారు.

సారా విక్రయాలను అరికట్టాలి



మహిళా పోలీసులతో సెబ్ సీఐ అరుణమ్మ

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో సారా విక్రయాలను అరుకట్టడంతో మహిళా పోలీసుల కృషి చేయాలని సెబ్ సీఐ సీహెచ్ అరుణమ్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని 19 గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో ఆమె సమావేశం నిర్వహించారు. సారా విక్రయాలు జరుగుతున్న తీరుపై చర్చించారు. సారా తయారీ, విక్రయాలను అరికట్టడం, సంబంధిత వివరాలను నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయడం తదితర అంశాలపై మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీ వి.నాగేశ్వరరావు, సిబ్బంది పి.దేవి పాల్గొన్నారు.

వర్క్‌బుక్‌లు విధిగా రాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ షాలెంరాజు

మండపేట: అలసత్వానికి తావులేకుండా విద్యార్థులతో విధిగా వర్క్‌బుక్‌లు రాయించాలని, పరీక్షలకు సన్నద్ధం చేయించాలని డీవైఈఓ పి. షాలెంరాజు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతి రికార్డు, రిజిష్టర్ అప్‌డేట్‌గా ఉండాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం మెనూను ప్రదర్శించాలని, 90 శాతం మంది విద్యార్థులు భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు ఎస్ఆర్‌కే రవికుమార్, జి. వీరన్న, సీహెచ్ శోభావళి, సీహెచ్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులపై వడ్డీ రాయితీ



శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రపురం కమిషనర్

రామచంద్రపురం: స్థానిక మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల పాత బకాయిలపై వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 34 విడుదల చేసినట్లు రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె. శ్రీకాంత్‌రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు పాత బకాయిలతో పాటు 2022–23 ఆస్తి పన్నులు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని బకాయిలు చెల్లించాలని కమిషనర్ కోరారు.

నిబంధనలు గడ్డిపోచ..

- రహదారులను ఆక్రమిస్తున్న గడ్డి వాహనాలు
- ప్రాణ సంకటంగా మారిన ప్రయాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గొల్లపాలెం రోడ్డులో గడ్డి లారీపై భారీ లోడు, పక్కన అవస్థలు పడుతున్న రైతు

కాజులూరు: అటు వెళ్లాలా...! ఇటు వెళ్లాలా.. ఎటు వెళ్తే ఏమవుతుందో తెలియని అగమ్య గోచరంలా మారింది ఆ దారుల్లో ప్రయాణం. భారీ లోడుతో గడ్డి ట్రాక్టర్లు ప్రధాన రహదారులను ఆక్రమించి చక్కర్లు కొట్టడంతో ప్రయాణికులు తికమకపడుతున్నారు. నిబంధనలు మాకు పట్టవు అన్నట్లు లారీ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మాకెందుకులే అన్నట్లు అధికారులు వదిలేస్తున్నారు. ఫలితంగా ఎండు గడ్డి లోడుతో తిరుగుతున్న లారీలు, ట్రాక్టర్లు ప్రయాణికుల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయి. మితిమీరిన లోడుతో ఈ వాహనాల రోడ్డుపై వెళ్తుంటే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా రోడ్డుపై విద్యుత్ తీగలు, స్తంభాలకు వాహనాలు తగులుకోవటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నియోజకవర్గంలోని గొల్లపాలెం-కుయ్యేరు, యానాం-ద్వారపూడి రహదారిలో.. కాకినాడ- కోటిపల్లి ప్రధాన రహదారిలో పరిస్థితి ఇది. పరిమితికి మించిన లోడుతో గడ్డి వేసుకుని వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే ఇతర వాహనాలకు వెళ్లే చోటు ఉండడం లేదు. గతంలో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ఈ గడ్డి లారీలు, ట్రాక్టర్లు ఇటీవల పగటి వేళల్లోనూ రోడ్డెక్కుతున్నాయి.

అందుకే ఇలా వస్తున్నాయ్..

రామచంద్రపురం నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత గ్రామాలు ఎక్కువగా ఉండడంతో ఇక్కడి నుంచి కాకినాడ తదితర పట్టణాలకు ఎండు గడ్డి రవాణా అధికంగా జరుగుతోంది. లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాలకు ఇరువైపులా ఎత్తుగా గడ్డి లోడు వేసి తీసుకువెళ్తున్నారు. ఈ వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారికీ చోటు ఉండడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎదురుగా మరో ఇలాంటి వాహనమే వస్తే ఇక ట్రాఫిక్ చిక్కులే. రోజూ ఇలాంటి ఘటనలు ఆ దారుల్లో నిత్యకృత్యమయ్యాయి.

ప్రమాదాలు జరుగుతున్నా..

గత ఏడాది వేసవిలో కాజులూరులో రోడ్డుపై వెళ్తున్న గడ్డి ట్రాక్టరుకు పైన విద్యుత్ తీగలు తగులుకుని మంటలు వచ్చాయి. స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఇటీవల గొల్లపాలెంలో గడ్డి ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా స్తంభం ముక్కలైంది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. అధికారుల కళ్ల ముందే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పరిమితికి మించి ప్రయాణం



లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు మితిమీరిన లోడుతో ఎత్తుగా ఎండు గడ్డిని లోడు చేస్తున్నారు. వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఆక్రమిస్తుంది. ఇవి ముందు వెళ్తుంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల పాలవుతున్నాం. ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– పెంకే సత్యనారాయణ, కాజులూరు

కేసులు పెడుతున్నాం..



పరిమితికి మించిన లోడుతో రోడ్లపై పయనించే వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. కొన్ని సందర్భాలలో కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నాం. ప్రయాణికులకు ముందు వెళ్లే వాహనంతో ఇబ్బంది కలిగినట్లు అనిపిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

– ఎం.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: మండలంలో వివిధ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ వివరాలను ఎంపీడీవో డి.శ్రీనివాసు గురువారం విలేకరులకు తెలిపారు. మాచవరం, చెల్లూరు పంచాయతీ పరిధిలో రెండేసి వంతున, నదురుబాదలో ఒక వలంటీర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత గ్రామానికి చెందిన వారై ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులు కావాలని, 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు దాటి కుండా ఉండరాదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ప్రతులను సంబంధిత పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో సూచించారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు

రాయవరం: మాచవరంలో జరిగిన దాడి ఘటనలో గురువారం కౌంటర్ కేసులు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో కొంద్రపు చినచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంటి ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, సుధీర్, చినపెద్దలపై కేసు నమోదు చేశారన్నారు. అలాగే గంటి ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొంద్రపు సురేంద్ర, చంద్రమౌళి, చందు, అబ్బులుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు వివరాలు



ముసాయిదా జాబితాను రైతులకు అందిస్తున్న ఏఓ రవి

కె.గంగవరం: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద ఈ ఏడాదికి సంబంధించిన పంట నమోదు వివరాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ బలుసు రవి అన్నారు. గురువారం పాణింగపల్లి ఆర్‌బీకే వద్ద రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సామాజిక తనిఖీ నిమిత్తం ముసాయిదా జాబితాను ఆర్‌బీకేల వద్ద ప్రదర్శించి గ్రామ సభలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు తప్పకుండా జాబితాను పరిశీలించి తమ పంట నమోదు ప్రక్రియలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వ్యవసాయ శాఖ సిబ్బందికి రాత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. అనంతరం జాబితాను రైతులకు అందించారు. సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరామయ్య, గ్రామ పెద్దలు చీకట్ల గోపాలం, నీతిపూడి వెంకట్రావు, ఉప సర్పంచ్ గొడితి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబితాపై అభ్యంతరాలు తెలపండి

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్ని ఆర్‌బీకేలు, మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంటల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 13 నుంచి 17 వరకు ఈ జాబితాల ప్రదర్శన ఉంటుందని అన్నారు. గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రైతులు అభ్యంతరాలు ఉంటే గ్రామ సభల్లో, గ్రామ వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. మండలంలో 12,075 మంది రైతులకు గాను 17,549 ఎకరాల్లో వరి సాగు అయ్యిందన్నారు. 97 శాతం వరకు ఈకేవైసీ చేశామన్నారు. పంట నమోదు ముసాయిదాపై ఎటువంటి అభ్యంతరాలున్నా రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

ఇంటర్ రెండో ఏడాది పరీక్షలు ప్రారంభం

రామచంద్రపురం: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రామచంద్రపురంలోని ఐదు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. వికాస్ జూనియర్ కళాశాలలో 355 మందికి 344 మంది హాజరయ్యారు. వీఎస్ఎం కేంద్రంలో 463 మందికి 451 మంది, మోడరన్ కళాశాల కేంద్రంలో 422 మందికి 412 మంది, నారాయణ కళాశాల కేంద్రంలో 291 మందికి 285 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 365 మందికి 354 మంది పరీక్షలు రాశారని అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి సిబ్బంది పంపించారు. రామచంద్రపురం సీఐ వి.దుర్గారావు, ఎస్సై డి.సురేష్ బాబు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 226 మందికి 212 మంది హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

జిల్లాలో ఇలా..

రాయవరం: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమైన విషయం పాఠకులకు విదితమే. కోనసీమ జిల్లాలో 38 పరీక్షా కేంద్రాల్లో 10,937 మంది సెకండియర్ జనరల్ విద్యార్థులకు 10,603 మంది పరీక్షలకు హాజరయ్యారు. 334 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే 2,069 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 128 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు ఇంటర్‌బోర్డు డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్, డీవీఈఓ, హైపవర్ కమిటీలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి.



రామచంద్రపురం మోడరన్ కళాశాల వద్ద పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీఐ దుర్గారావు

ఉప ఎన్నికకు 3,515 మంది ఓటర్లు

రామచంద్రపురం రూరల్: నెలపర్తిపాడు ఎంపీటీసీ స్థానానికి సంబంధించి ఉప ఎన్నికకు 3,515 ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన గురువారం తెలిపారు. 32వ పోలింగ్ కేంద్రమైన మామిడిగుంట ప్రాథమిక పాఠశాలలో 6 నుంచి 9వ వార్డు వరకూ 868 మంది, 33వ పోలింగ్ కేంద్రమైన నెలపర్తిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 4వ వార్డు వరకూ 868 మంది ఓటర్లు, అదే పాఠశాలలోని 34వ పోలింగ్ కేంద్రంలో 5 నుంచి 10వ వార్డు వరకూ 625 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలికి అవార్డు

కాజులూరు: జగన్నాథగిరి ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మికి బీజేపీ నేతలు సుష్మాస్వరాజ్ అవార్డు ప్రదానం చేశారు. గురువారం అమలాపురంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా తదితరులు పార్టీ మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు కొప్పన లక్ష్మికి సుష్మాస్వరాజ్ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. పార్టీ అభివృద్ధికి లక్ష్మి చేస్తున్న సేవలను గుర్తించి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సూచనల మేరకు అవార్డు అందించారని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు, రాష్ట్ర మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు లక్ష్మీసంతోష్ తెలిపారు.



ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మికి అవార్డు ప్రదానం చేసి సత్కరిస్తున్న బీజేపీ నేతలు

శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి



కేదారిలంకలో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం: మండలంలోని శెట్టిబలిజ సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి చేయనున్నట్టు మండల శెట్టబలిజ సంక్షేమ సంఘం మండల నాయకులు పేర్కొన్నారు. కేదారిలంకలో సంఘం నాయకుడు మట్టపర్తి పెదలక్ష్మణరావు ఆధ్వర్యంలో మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై సంఘం మండల అధ్యక్షుడు వాసంశెట్టి వాసు, ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనివాసు, కార్యదర్శి వనుం పార్థసారథి, కోశాధికారి శీలం రాంబాబు చర్చించారు. సమావేశంలో సంఘం పెద్దలు పితాని సూర్యచంద్రరావు, చిట్టూరి నాగేంద్ర ప్రసాదు, గుత్తుల పెద్దబ్బు, శీలం గోవిందు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

కాజులూరు: నామవానిపాలెంలో కలవల సమాధానం (సాహెబ్) ఇటీవల మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న తదితరులు గురువారం పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట: సాధారణ మరమ్మతుల్లో భాగంగా స్థానిక ఫీడర్‌లో పనులు చేపడుతున్న కారణంగా శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఏడీఈ జి.తిరుమలరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాటిమీద, కేపీ రోడ్డు, న్యూకాలనీ, సూర్యారావుపేట, పాత ఆంధ్రాబ్యాంకు వీధి, ఎస్సీ కాలనీ, కొండపల్లి వారి వీధి తదితర ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందని

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ

మండపేట: డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులకు రుణాల మంజూరు ద్వారా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతానికి బ్యాంకర్లు సహకరించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. జాయింట్ మండల లెవిల్ బ్యాంకర్ల మీటింగ్ గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడ్కో హౌసింగ్, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి డ్వాక్రా రుణాలు, జగనన్న తోడు తదితర పథకాల అమలుపై సమీక్షించారు. రుణాల రికవరీపై బ్యాంకర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా లేని లబ్ధిదారులకు జగనన్న పట్టాపై రుణసాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్‌డీఏ డీపీఎం అన్నపూర్ణ, మెప్మా డీసీఓ శ్రీనివాస్, ఏపీఎంలు రవిరాజా, ధనరాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం?

రాయవరం: మండలంలోని ఒక గ్రామంలో బాలికను ఓ బాలుడు లోబర్చుకుని, గర్భవతిని చేసినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు ఆమెను వేరే గ్రామంలో ఉంచినట్లు తెలిసింది. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని ఎస్సై సురేష్ తెలిపారు.

పాఠశాల తనిఖీ

మండపేట: ద్వారపూడి శివారు వేములపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ కమలకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఎంఈఓ ఎస్.రామచంద్రరావు, హెచ్‌ఎం ఎస్ఆర్‌కే రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటికెళ్లి.. వైద్య సేవలందించి..

కపిలేశ్వరపురం: వైద్యులు సేవా దృక్పథంతో మన స్ఫూర్తిగా గ్రామాల్లో సేవలందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలనివ్వడమే అందుకు నిదర్శనం. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి గురువారం గ్రామంలోని వృద్ధ రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స చేశారు. గ్రామ సచివాలయం-2 వద్ద నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించారు. డాక్టర్ రత్నకుమారి 124 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలపై షెడ్యూలు ప్రకారం క్రమం తప్పకుండా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, సుగర్ తదితర పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ బి.రామారావు ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ కె.రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వరరావు, 104 సిబ్బంది ప్రసాద్, రాజు ఆశ కార్యకర్తలు సేవలందించారు.



అంగరలో వృద్ధుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వైద్యాధికారి రత్నకుమారి

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

- ఘనంగా అమరజీవి జయంతి

మండపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని గురువారం మండపేట, మండల గ్రామాల్లో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ టి.రామ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, పెంకే గంగాధర్ పాల్గొన్నారు. కేశవరం మెయిన్‌స్కూల్ ఆవరణలోని పొట్టి రాములు విగ్రహానికి ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, వుండమట్ల నారాయణరావు, పురంశెట్టి శ్రీను, పలుకూరి వెంకన్నబాబు, గంధం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఐ.రాజు, సూపరింటిండెంట్ వి.ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏడిదలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, పలివెల సుధాకర్ పాల్గొన్నారు. తాపేశ్వరంలో వైఎస్సార్ సీపీ నేత సూరిపండు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

రామచంద్రపురం రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అంబటి భవాని, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యాలయ ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ కొప్పుల లాజరు తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పించారు.



కేశవరంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు



అముజూరులో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసిన అధికారులు, సిబ్బంది



రామచంద్రపురంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ



నిడసనమెట్లలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ

రాయవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే తెలుగు ప్రజలకే కాకుండా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో డి.శ్రీనివాసు, కార్యాలయ సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని 12 గ్రామాల పరిధిలోని 46 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పించారు.

కపిలేశ్వరపురం: నేటి, భవిష్యత్ తరాల ప్రజలు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవాలని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. నిడసనమెట్టలోనిర్వహించిన శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఆయన త్యాగనిరతిని కొనియాడారు.

త్యాగం మరువలేనిది

కాజులూరు: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆ నాడు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని వైఎస్సార్ సీపీ నేత, గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక అన్నారు. అమరజీవి జయంతిని గొల్లపాలెం సచివాలయంలో సర్పంచ్ ప్రసన్నమౌనిక, కోలంకలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వరదా శేషారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసన్న మౌనిక మాట్లాడుతూ తెలుగుజాతి కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు.

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అముజూరు సచివాలయం వద్ద ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, సర్పంచ్ నానాపరపు కళ్యాణి ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేశారు. గ్రామ పెద్దలు నానారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూరుశాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేయాలి



సమీక్ష సమావేశంలో ఆర్‌డీ సత్యనారాయణరావు, కమిషనర్ రామ్‌కుమార్

మండపేట: మార్చి 31వ తేదీకి పట్టణంలో నూరుశాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణరావు సూచించారు. ఆస్తి పన్నుల వసూళ్లపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.రామ్‌కుమార్, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మార్చి 15వ తేదీ నాటికి దాదాపు రూ.63 లక్షలు అధనంగా వసూలు చేసినట్టు రెవెన్యూ సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌డీ సత్యనారాయణావు మాట్లాడుతూ ఆస్తి పన్ను డిమాండ్ రూ.7.39 కోట్లకు గాను 55 శాతానికి పైగా వసూళ్లతో మండపేట జిల్లాలో ముందంజలో ఉండటంపై రెవెన్యూ ఉద్యోగులను అభినందించారు. నెలాఖరవు నాటికి మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషిచేయాలన్నారు. టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ తదితర అంశాలపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు.